క్లుప్తంగా

రేపు హనుమాన్ శోభాయాత్ర

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధి నుంచి గురువారం ఉదయం ప్రారంభమయ్యే హనుమాన్ శోభాయాత్రకు ప్రతి ఇంటి నుంచి పాల్గొనాలని విజయవంతం చేయాలని గ్రామ గ్రామానికి వెళ్లి ఆహ్వాన పత్రికలను పంపిణీ చేసినట్లు శ్రీవేంకటేశ్వర రాచరాయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి, మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డిలు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఈయాత్ర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పెద్ద ఎత్తున మోటారు సైకిళ్లతో రావాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ రిటైర్డ్ ఈవో యోగీశ్వరరెడ్డి, పాలక మండలి సభ్యులు రంగా రెడ్డి, శ్రీరామమూర్తి, పెంచలయ్య, మను, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని చెన్నంరాజుపల్లెలో వెలసిన శ్రీపాటేమ్మ తిరునాల ఉత్సవాలు గురు, శుక్రవారం రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం అమ్మవారికి గణపతి పూజ, ఆకుపూజ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం అభిషేకాలకరణ, తీర్థ ప్రసాదాలు, ఆలయ అవరణలో కోలాటం, అర్కెస్ట్రా, రాత్రికి గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

జూదరులు అరెస్ట్

సింహాద్రిపురం : మండలంలోని అగ్రహారం గ్రామంలో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో దాడి చేశారు. ఏడు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,190లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల ప్రజలు గ్రామాలలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు తెలపాలని, తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఇందుకు ప్రజలు సహకరిస్తే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి అణిచివేస్తామని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ముద్దనూరులో శాశ్వత ఆధార్ సేవా కేంద్రం

ముద్దనూరు : ముద్దనూరు-2 సచివాలయంలో నిరంతరంగా ఆధార్ సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు మంగళవారం ఒక పత్రి కాప్రకటనలో తెలిపారు. ముద్దనూరు-2 సచివాలయంలో(గ్రామపంచాయతీ కార్యాలయం)లో సోమవారం నుంచి శనివారం వరకు ఆధార్ నమోదు ప్రక్రియకు తగిన సిబ్బందిని నియమించినట్లు, ఈ కేంద్రంలో సేవలను సద్వినియోగంచేసుకోవాలని ఆయన సూచించారు.

బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్ట్

సింహాద్రిపురం : మండలంలోని బలపనూరు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం ఎస్ఐ రవి కుమార్ దాడి చేశారు. ఈ దాడిలో బెల్టు షాపు నిర్వహిస్తుండటంతో ఇంట్లో ఉన్న 10 మద్యం బాటిళ్లను సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ, తాగునీరు, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, ఆరోగ్యం, అటవీ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తగిన నివేదికలతో హాజరు కావాలని ఆయన తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవమ్మ బుధవారం పదవీ విరమణ కార్యక్రమం ఉంటుందన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టుచేయాలి

జమ్మలమడుగు : తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి యోబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎర్పడిన తర్వాత దళితులపై విచ్చల విడిగా దాడులు జరుగుతున్నా పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని దగ్గరుండి అమలు చేయడం జరుగుతుందన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో దళితులపై దాడి జరిగిన ఆయన స్పందించలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎర్పడిన తర్వాత కక్ష సాధింపు ధోరణి తప్ప పాలన పూర్తిగా మరచిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులే టార్గెట్‌గా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. బాపట్ల మాజీ ఎంపీ నందిగాం సురేష్‌పై టీడీపీ కార్యకర్తలు తాగి నానా యాగి చేసి దౌర్జన్యానికి పాల్పడితే మాజీ ఎంపీపై కేసు నమోదు చేసి పోలీసులు జైలుకు పంపించారన్నారు. టీడీపీ కార్యకర్తపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకుని ఇచ్చిన హామీలను అమలు పరిచేవిధంగా చూడాలని హితవు పలికారు.

ఆశాజనకంగా వేసవి పత్తి సాగు

- నియోజకవర్గంలో 5 వేల ఎకరాలకుపైగా సాగు
- వర్షాలతో పూతదశలో పంట
- తెగుళ్లు సోకకుండా ముందుజాగ్రత్త చర్యలు
- ధరలు ఉంటే ఆదాయమంటున్న పత్తి రైతులు



గొందిపల్లె వద్ద సాగులో ఉన్న వేసవి పత్తి పంట



పత్తిలో కలుపు నివారణకు సేద్యం చేస్తున్న రైతులు

వేముల : ఈ ఏడాది వేసవి పత్తి సాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. నియోజకవర్గంలో 5 వేల ఎకరాలకుపైనే పత్తి సాగైందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వేసవిలో అరటి, మిరప పంటలు మినహా ఇతర ఏ పంటలు సాగు చేయలేదు. దీంతోనే ప్రత్యామ్నాయంగా రైతులు వేసవి పత్తి పంటను ఎంచుకున్నారు. ముఖ్యంగా సాగులో తక్కువ పెట్టుబడులు కావడంతోపాటు దిగుబడులు కూడా బాగా ఉంటాయనే ఉద్దేశ్యంతో రైతులు పత్తి సాగు వైపు మొగ్గు చూపారు. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగా, చక్రాయపేట, తొండూరు మండలాల్లో అక్కడక్కడ పత్తి పంటను రైతులు సాగు చేసుకున్నారు. పంట సాగు చేసి రెండు నెలలు దాటిపోయింది. ప్రస్తుతం పంట పూత, కాయ దశలో ఉంది.

ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు

పత్తి సాగులో పెట్టుబడులు కూడా అవుతున్నాయి. ఎకరాకు రూ.30 వేలకుపైనే రైతులు పెట్టుబడులు పెడుతున్నారు. పంట సాగు చేసిన మొదలు దిగుబడులు పూర్తయ్యే వరకు పెట్టుబడులు అవుతున్నాయి. సాగులో కలుపు తీసే కూలీ ఖర్చులకు, దిగుబడులు అందే సమయంలో పత్తి తీసే కూలీ ఖర్చులు, పంటలో సేద్యపు ఖర్చులు పెరిగిపోయాయి. ఎకరాకు సేద్యం చేస్తే రూ.700లు ఇస్తున్నారు. ఇలా రెండు, మూడు సార్లు సేద్యాలు చేయాల్సి వస్తోంది. అలాగే పంటకు తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంట పూర్తయ్యే సరికి నాలుగుసార్లు మందులను రైతులు పిచికారి చేయడంతో పెట్టుబడులు అవుతున్నాయి.

ఎకరాకు 12 క్వింటాళ్లపైనే దిగుబడులు

వేసవి పత్తి సాగులో దిగుబడులు కూడా బాగా వస్తున్నాయి. ఎకరాకు 12 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. పంట కాలం ఐదారు నెలలు ఉంటుంది. పంటను కంటికి రెప్పలా కాపాడుకుని సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతో దిగుబడులు పెరుగుతున్నాయి. అంతేకాక ఈ ఏడాది వర్షాలు కూడా సకాలంలో రావడంతో వేసవి పత్తి పంటకు కలిసొచ్చింది. వర్షాలు రాకపోతే పంట పూత దశకు వచ్చిన ఎండలకు రాలిపోయేది. అయితే పదును వర్షాలతో వేసవి పత్తి పంటకు ఊరటగా చెప్పవచ్చు.

ధరలు ఉంటే సాగులో ఆదాయం

పత్తి దిగుబడులు వచ్చే సమయానికి ధరలు ఉంటే ఆదాయం ఉంటుందని రైతులు అంటున్నారు. గతంలో క్వింటా పత్తి రూ.10 వేలు పలికింది. అయితే గత మూడేళ్లుగా క్వింటా పత్తి రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ధరలు మించి లేవు. అయితే ఈ ఏడాది ధరలు పెరిగితే ఆదాయం ఉంటుందనే ఆశతో రైతులు ఉన్నారు. మార్కెట్‌లో పత్తి ధరలు ఏ మేరకు ఉంటాయనేది రైతులలో ఆందోళన ఉంటోంది. ధరలు ఉంటే సాగులో పెట్టుబడులు పోనూ ఎకరాకు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు ఆదాయం ఉంటుందని రైతులు అంటున్నారు.

8 ఎకరాలలో పత్తి సాగు చేశా



నాకున్న 8 ఎకరాలలో వేసవి పత్తి సాగు చేశా. మార్చి చివరి వారంలో పంట సాగు సాగు చేశా. పంట పూతదశలో ఉంది. దిగుబడులు వచ్చి ధరలు ఉంటాయనే ఆశతో ఉన్నాం. పెట్టుబడులవుతున్నా ఆదాయం ఉంటుందనే పత్తి సాగు చేసుకున్నా.

– అంకిరెడ్డి, పత్తి రైతు, గొందిపల్లె

ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు



పత్తి సాగులో ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు వస్తున్నాయి. కూలీ ఖర్చులు, తెగుళ్ల నివారణకు మందుల ఖర్చులు అదనం కావడంతో పెట్టుబడులు అవుతున్నాయి. సకాలంలో మందులు పిచికారి చేసి పంటను కాపాడుకుంటున్నాం. మార్కెట్‌లో పత్తి క్వింటా రూ.8 వేల ధరలు ఉన్నా ఆదాయం ఉంటుంది.

– గంగిరెడ్డి, పత్తి రైతు, గొందిపల్లె

కక్షపూరిత అక్రమ అరెస్టులు దారుణం



ఆర్డీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి అధికారి రెడ్డిలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : కూటమి ప్రభుత్వం చేస్తున్న కక్షపూరిత అక్రమ అరెస్టులపై మంగళవారం పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి అధికారి రెడ్డిలక్ష్మికి వైఎస్సార్‌సీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ దురుద్దేశంతో ప్రభుత్వ ఉన్నతాధికారులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. కృష్ణమోహన్‌రెడ్డి దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పులివెందుల ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన పాడా సంస్థ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించారు. పులివెందుల లోని ప్రజలతో మమేకమవుతూ ఎటువంటి అవినీతి ఆరోపణ లేకుండా మంచి ప్రభుత్వ అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. గత 20 ఏళ్లుగా పులివెందుల ప్రాంత ప్రజలకు, ఈ ప్రాంతానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవ చేస్తున్న వ్యక్తి. ఇటువంటి ప్రభుత్వ అధికారిపై కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా అక్రమ కేసులలో ఇరికించడం బాధాకరమన్నారు. ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డిపై, పీఎస్ ఆంజనేయులు లాంటి ఉన్నత అధికారులపై అక్రమ కేసులు పెట్టి వేధించడం వంటి కార్యక్రమాలు మానుకుని హోంమంత్రి, ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పులివెందుల పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, దూదేకుల సంఘ రాష్ట్ర మాజీ చైర్మన్ రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిశోర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి, కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, పద్మనాభరెడ్డి, కో ఆప్షన్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగాపురం మధు, కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, రవి, తోటంశెట్టి హరి, శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు జశ్వంత్‌రెడ్డి, మారుతిరెడ్డి, ప్రశాంత్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త రేషన్ పంపిణీపై ధర్నాకు పిలుపునివ్వండి

పులివెందుల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అస్తవ్యస్తంగా ఉన్న ఎండీయూ, రేషన్ పంపిణీ వ్యవస్థపై వైఎస్సార్‌సీపీ తరఫున ధర్నాకు పిలుపునివ్వాలని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ దూదేకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ విన్నవించారు. మంగళవారం పులివెందులలో రసూల్ మాట్లాడుతూ రేషన్ పంపిణీ వ్యవస్థపై ఆగస్టు 15వ తేదీలోపు మీకు వీలైన తేదీలలో ధర్నాకు పిలుపునిస్తే ధర్నాను విజయవంతం చేయడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో రైతు పోరు, విద్యుత్ ఛార్జీల పోరు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా మనం చేసిన అన్ని కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రేషన్ కోసం ఉదయం 5 గంటల నుంచి రాష్ట్ర ప్రజలు పడిగాపులు కాస్తున్నారన్నారు. కానీ రేషన్ డీలర్లు మాత్రం బియ్యం ఇచ్చేది మూడు రోజులే నని, అవి కూడా తూకం తక్కువగా ఉన్నాయన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎండీయూ విధానాన్ని రద్దు చేసే ఆలోచనలో ఉందని తెలిపారు.

రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలి



చీనీ కాయల వేలంపాటను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని చీని కాయల మార్కెట్‌కు రైతుల దగ్గర నుంచి వ్యాపారస్తులు చీని కాయలు కొనుగోలు చేసిన వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక చీనీ కాయల మార్కెట్‌లో వేలంపాట నిర్వహించే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇతర జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నాయో అదేవిధంగా పులివెందుల చీని కాయల మార్కెట్‌లో ధరలు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సూట్ విధానం లేకుండా వ్యాపారాలు చేయాలన్నారు. అనంతరం మార్కెట్‌ను పరిశీలించి చీని వేలంపాట ఏ విధంగా జరుగుతుంది, ఏ విధంగా నిర్వహించాలనే దానిపైన వ్యాపారస్తులకు, రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీ ఆజాద్‌వల్లి, సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, ట్రేడర్స్ రమణారెడ్డి, సూరారెడ్డి, మనోహర్ రెడ్డి, సాదక్‌వల్లి, తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి



వేంపల్లెలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఆర్మీ సైనికులు, ప్రజలు

వేంపల్లె : దేశంలోని ప్రజల క్షేమం కోసం పోరాడుతున్న భారత సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వేంపల్లెలో బీజేపీ నేతలు, ప్రజలు, మాజీ ఆర్మీ సైనికుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. భారత దేశ త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశాన్ని గొప్ప సేవలు అందిస్తున్న భారత సైనికుల గొప్పతనాన్ని అభినందిస్తూ తిరంగా ర్యాలీని చేపట్టడం సంతోషకరమని, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత త్రివిధ దళాలకు ప్రతి భారతీయుడు అభినందనలు తెలపాలన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



పొలంలో వేసవి సేద్యం చేస్తున్న రైతు

సింహాద్రిపురం : పదునుపాటి వర్షం కురవడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుంది. దీంతో గ్రామాల్లో అన్నదాతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పొలాలను సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పొలాలలో సాగు చేసిన పంటల వ్యర్థాలను కూలీలతో తొలగించి, వాటిని కాల్చే పనులు చేపడుతున్నారు. అలాగే వేసవి దుక్కుల్లో భాగంగా ఎద్దులు, ట్రాక్టర్లతో పొలాలను దున్నుతున్నారు. గత ఏడాది అన్నదాతలు అతి వృష్టి, అనావృష్టి రూపంలో రైతులు నష్టాలను చవిచూశారు. అయినా మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈసారైనా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వారు కోరుకుంటున్నారు.

అంజన్న ఆలయంలో అంకురార్పణ, హోమం

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమంత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అంకురార్పణ, హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, అర్చకులు హరిప్రవీణ్‌లు తెలిపారు. మూడు రోజులపాటు హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. 22వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



ఉత్సవ విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తున్న ఆలయ పురోహితులు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం వేదపారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారాతోరణం, ఆరాధన, అగ్నిప్రతిష్ట హోమం, మూలమంత్ర హవనం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు.

నేత్రదానం



కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను అందుకుంటున్న నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు

పులివెందుల రూరల్ : అంధ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక చిన్నన్నరాముల వీధిలోని నివాసముంటున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ అన్నారెడ్డి బాలిరెడ్డి మృతి చెందారు. దీంతో మృతుని భార్య వెంకటలక్షుమ్మ, కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని నివాసానికి వెళ్లి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపించారు. ఈ సందర్భంగా నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి 9966509364, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సమాచారమివ్వాలన్నారు.

లింగ వివక్ష చూపరాదు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి

సింహాద్రిపురం : లింగ వివక్ష చూపరాదని ఐసీడీసీ మండల సూపర్‌వైజర్ వసంతకుమారి తెలిపారు. కిశోర వికాసంలో భాగంగా మంగళవారం మండలంలోని కోవరంగుంటపల్లె అంగన్‌వాడీ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష, అసమానతల గురించి వివరించారు. స్త్రీలు ప్రతి రంగంలో ఉన్నారని, లింగ వివక్ష లేకుండా చేయాలనేది మనందరం బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ అంకాలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బలక్ష్మి, గంగాదేవి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొండాపురం : కార్మికులకు పనికి తగిన కనీస వేతనం ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.మనోహర్ బాబు ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి పి. వెంకటరమణలు తెలిపారు. మంగళవారం కొండాపురంలో అంగన్‌వాడీ వర్కర్స్, ఆశ వర్కర్స్, భవన కార్మికులు సీపీఐ, ఏఐటీయూసీ ప్రజాసంఘాల నాయకులతో కలసి సమ్మె నిర్వహించారు. అనంతరం మండల తహసీల్దార్ గురప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పులివెందులకు రెండు పతకాలు



బంగారు పతకాలను అందుకుంటున్న విద్యార్థిని షేక్ నాఫియా తుబస్సుమ్

పులివెందుల టౌన్ : పట్టణానికి చెందిన నూరుల్లాహ్ కుమార్తె షేక్ నాఫియా తబస్సుమ్ అన్నా యూనివర్సిటీకి అనుసంధానం జేసీటీ కళాశాలలో ఫస్ట్ ర్యాంక్ సాధించి రెండు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుందని ఆయన తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కోయంబత్తూరులోని జేసీటీ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఈసీఈ పూర్తి చేసి కళాశాలలోని ఫస్ట్ ర్యాంక్ వచ్చిన శుభ సందర్భంలో కాలేజీ యాజమాన్యం రెండు స్వర్ణ పతకాలను బహుకరించినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లాహ్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఉద్యోగుల సమస్యలు, బకాయిల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకపోవడం కోసం మూడవ కౌన్సిల్ సమావేశం విజయవాడలో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. జూన్ 5వ తేదీ మూడవ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌లను ఆయన మంగళవారం విడుదల చేసి మట్లాడారు.